స్కెచ్

# కప్పు కాఫీకోసం—

' మరామ "

ఆ రోజు ఆదివారం. ప్రొద్దున కాఫీతో అప్పు తెచ్చిన రెండు రూపాయలు పూర్తి అయాయి. అయిపోయినట్లు వూహాకందలేదు. గదికి వచ్చి పేపరు చదివి బద్ధకంగా ఒళ్ళు విరుచుకునేటప్పటికి తొమ్మిదిన్నర గంటలు పైన అయింది. టవలు తీసుకొని బాత్ రూము వైపు నడిచాను. మురళీవాళ్లూ కనబడితే కొంచెంసేపు బాతాఖానీలోకి దిగింది వ్యాపారం. స్నానంచేసి బయటకు వచ్చేటప్పటికి పది గంటలు దాటింది. బట్టలు వేసుకొని జేబులో చేతులు పెట్టేసరికి టిక్కెట్ల పుస్తకం దొరికింది. జేబు గలగల లాడించి చూచాను. బరువుగా వుంది. ఆఫీసు బీరువా తాళంచెవి కనుపించింది. అంతే. డబ్బులు ఎక్కడైనా పెట్టానా? అని వెతికాను. చిల్లిగవ్వ కూడా కనుపించలేదు. గబగబా పక్కగదుల్లో మిత్రులదగ్గరకు వెళ్ళాను. తలుపులకి తాళాలు వేసివున్నాయి. మధ్యాహ్నం కాఫీకి ఏంచేసేది? మహాసముద్రంలాంటి ఈ మద్రాసు మహానగరంలో మనకు తెలిసినవాళ్ళెవరున్నారు! తెలిసివున్న కొద్దిమందిదగ్గరా అప్పుడే నాలుగైదుసార్లు అప్పు తీసుకోవడం జరిగింది. ఈలోపుగా ఇంటిదగ్గర్నుంచి మనియార్డరు వస్తుందేమోనంటే అదీ రాలేదు. ఇవ్వాళ ఆదివారం. ఒకవేళ వచ్చినా ఇవ్వరు. ఇక ముష్టికి బయలుదేరాలి. ఎక్కడికి పోవాలనే సందేహం పట్టుకుంది. ఊహాలోకి ఎవరూరాలేదు. ఎరుగున్నవాళ్ళందరి దగ్గరా అప్పులు పెట్టేశాను. ఆలోచించాను. ఏమయితే అవుతుందని రమణ రావు బాబాయిగారింటికి దారితీశాను. ఆయన రెండురోజులక్రితమే నాలుగోసారి అప్పిచ్చాడు. మళ్ళీ అడిగితే ఏంబాగుంటుంది? అయినా సమయం వచ్చింది తెగించాలనుకున్నా. గబగబా నాలు గడుగులు వేసేటప్పటికి బాబాయిగారింటికి వచ్చేశాను. "రమణరావ్ బాబాయ్" అని క్రిందనుండి కేక వేసేటప్పటికి—

"రారా... మోహన్‌రావ్" అని బాబాయి గొంతుక వినిపించింది.

"ఫర్వాలేదు. బ్రతికిపోయానురా భగవంతుడా" అనుకొని మేడమెట్లు ఎక్కాను. బాబాయి అప్పుడే తలకు స్నానంచేసినట్లుగా వున్నాడు. ఎండలో కూర్చున్నాడు.

"మంచినీళ్లిమ్మంటావా?"

"ఒద్దులే......ఊ......కొంచెం తీసుకరా" అన్నాను నసుగుతూ.

బాబాయి నవ్వుకున్నాడు నా మనస్తత్వానికి. "అమ్మా, మోహనరావు వచ్చాడు మంచినీళ్ళు ఇవ్వు" అని కేక వేశాడు.

నాయనమ్మ మంచినీళ్ళు తీసుకొచ్చి "ఏం నాయనా కులాసా? ఎక్కడా కనబడటం మానివేశావు" అంటూ అందించింది.

"కులాసాయే. ఏదీ ఆఫీసులో తీరుబడి కావడం లేదు" అని గడగడా మంచినీళ్ళుత్రాగి గ్లాసు కిందపెట్టి లేచాను.

"భోజనానికి లే. అమ్మా వడ్డించెయ్యి" అన్నాడు రమణారావు బాబాయి.

"రా. నాయనా" అంది నాయనమ్మ.

"వద్దు...వద్దు...ఇప్పుడే భోంచేసి వచ్చాను. పదకొండుగంటలు దాటింది. మీరింకా భోంచెయ్యలేదా?" అన్నాను.

"ఇవాళ ఆదివారంగా. ఎలాగా ఆలశ్యం తప్పదు..."

అవునుగాని కొంచెం కాఫీ తెప్పిస్తాను తాగు" అని రమణరావు బాబాయి బలవంతం చేశాడు. గుండె గుభీలుమంది. "ఒద్దులే ఇప్పుడేం త్రాగను" అనేసి ఆలోచనలో పడిపోయాను. వారు చేసిన మర్యాదకు సిగ్గుపడిపోయాను. అలాంటివాడు వెధవ ఓ బేడకోసం ఎలా అడిగేది! ఆత్మాభిమానం దెబ్బతిన్నది. అడిగితేచాలు నిముషాలుమీద బేడ కాదు రూపాయ వచ్చేస్తుంది. కాని...కాని...

ఏమిటో వారి ముఖం ఎదుట నా మనస్సు సిగ్గుపడి పోయింది. అప్పటికే నాలుగుసార్లు అప్పు పడిపోయాను, ఈ వారంరోజుల్లోను. బాబాయిని అడగటానికి దమ్ములు లేకపోయాయి. అసలు అడగటానికి సిగ్గువేసింది. కొంచెంసేపు మాట్లాడి వెనక్కు హోటలువైపుకు నడిచాను. ఇంట్లోంచి రోడ్డుమీదకు వచ్చేటప్పటికి మధ్యాహ్నం కాఫీకి ఎలా? అలవాటుపడ్డ ప్రాణం ఒకపూటకు లేకపోతే ఆత్మహత్యచేసుకున్నంతపని. ఎలాగుమరి? అడగటానికి సిగ్గుపడిపోయాను. మళ్లా వెనక్కుతిరుగుదామా అంటే అసభ్యంగా వుంటుందనుకొని హోటలుకు నడిచాను. కాని సరిగా అన్నం తిన బుద్ధి అవలేదు. ఆలోచిస్తూనే ఏవో నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని బయటకు వచ్చాను. ఇప్పుడెక్కడికి పోవడం అనేది ప్రశ్న? ఆఫీసులో ఎవరైనా వుండవచ్చునని బయలుదేరాను. ఆఫీసులో ప్యూను తప్ప మరెవ్వరూ కనిపించలేదు. ఎండలో మళ్ళీ రూముకుపోలేక కుర్చీలో కూలబడి డ్రాయరు మీద కాళ్ళుంచి ఈ పూట కాఫీ ఎలాగూ అని ఆలోచిస్తూ ఆలోచిస్తూ బడలికచేత కన్ను మూశాను. అలా ఎంతసేపు నిద్రపోయానో నాకే తెలియలేదు. వీపుమీద చురుక్కుమంది. బలవంతంగా కళ్లు తెరువవలసి వచ్చింది, ఈ ఒళ్లు నాది కాదనిపించింది. విరుగగొట్టినట్లయింది. దిమ్మదిగాలేచి చూద్దునుగదా నల్లి. కుర్చీని నల్లులు కనుపించాయి. చిరాకు వేసింది. గబగబా లేచి పైపుదగ్గరకుపోయి ముఖం కడిగేసి మళ్ళి కుర్చీలో కూర్చున్నాను. అప్పటికి రెండున్నర గంటలు దాటింది. ప్యూను గుర్రుకొట్టేస్తున్నాడు.

"వెంకటస్వామీ" అని గట్టిగా కేకవేశాను. అతను పలుకలేదు. దగ్గరికివెళ్ళి తట్టి లేపాను. కళ్ళు నులుపుకొంటూలేచి "ఏమి సార్" అన్నాడు.

"అంత గాఢంగా నిద్రపోతున్నావేం?"

"ఏమీలేదు సార్ నిద్ర వచ్చేసింది."

"సరేలేగాని నీదగ్గర రెండణాలు వుంటే ఇవ్వ రేపు ఆఫీసుకు తెచ్చిఇచ్చేస్తాను."

"లేవు సార్"

"ఒక్క అణా అయినా సరే."

"అసలు పైసా లేదు సార్." అంటూ జేబు దులిపేశాడు.

"మంచిపని చేశావురా నాయనా" అనుకొని మళ్ళీ కుర్చీలోకి వచ్చి సిగరెట్టు వెలిగించాను. సరిగా సమయానికి కాఫీ లేకపోయేటప్పటికి పిచ్చెక్కినంత పనయింది. ఏం చేసేది?

"వెంకటస్వామీ దగ్గరలో ఎవరివైనా అప్పు అడిగి తీసుకురా. రేపు ఇచ్చేద్దాం."

"లేదుసార్. ఎవ్వరూ ఇవ్వరు. అంతా కొత్త."

"అయినా అడిగిచూద్దూ."

"ఇవ్వరూ సార్" అంటూ మళ్ళీ కళ్ళు మూశాడు. గుర్రు కూడా మొదలుపెట్టాడు. ఈ కుంభకర్ణుని కదిపి లాభంలేదనుకున్నాను. పిచ్చి ఎక్కిపోతోంది. కాఫీలేదు. ఏమీ తోచడంలేదు. ఈ పూటకు గుక్కెడు కాఫీలేదు. ఏంచెయ్యాలి? ప్రాణం గిజగిజ తన్నుకుంటోంది. మళ్ళీ ఇంకో సిగరెట్టు తీసి వెలిగించాను. గట్టిగా దమ్ము లాగేటప్పటికి కళ్లు తిరిగినంత పని అయింది. కుర్చీలో అలాగే కళ్ళు మూసుకుని వుండిపోయాను. కాఫీ గురించి ఆలోచనలు, ఆ కోపంలో, ఆ ఆవేదనలో ఆవేశం కథలోకి దిగింది మనస్సు. కళ్లు తెరిచాను. ఎదురుగా సిరాబుడ్డి కనుపించింది. గబగబా డ్రాయరు సొరుగుల్లోంచి కాగితాలు తీసి కలం పట్టుకొని మెదడులో తట్టిన, దుఃఖమయ జీవితాల బాధ, గాథను మొదలుపెట్టేసరికి మూడున్నర గంటలు దాటిపోయింది. అలాఅలా వ్రాస్తూనే వున్నాను. కాఫీ త్రాగని కాకలో ప్రపంచం కనుపించలేదు. ఏమిటో వ్రాసేస్తున్నా. పూర్తిచేసి తలెత్తి చూద్దునుగదా! ప్యూను లేడు. గడియారంవంక చూచాను. అయిదున్నర గంటలయింది. మళ్ళీ కాఫీ సంగతి జ్ఞాపకం వచ్చింది. వేళ దాటిపోయింది కాబట్టి కాఫీ తృష్ణ చచ్చిపోయింది. క్రింద చూస్తే పెట్టె సిగిరెట్లు కాలిన బూడిద కనుపించింది. అయినా కాఫీ త్రాగని బాధ మనస్సులో కొద్దిగా వుండనే వుంది. వ్రాసిన కథ మళ్ళీ చదువుదామని కాగితాలు పైకెత్తాను.

"నమస్కారమండి" అన్న శబ్దం. రాజుగారు వచ్చారు. ఆయన వాచ్ మేన్. పరిస్థితులవల్ల ఇంత నీచస్థితికి రావాల్సి వచ్చింది.

"రండి రాజుగారూ! ఇవాళ తొందరగా వచ్చినట్లుగా వున్నారు."

"లేదండీ. ఇంట్లో ఏమీ తోచకపోతే వచ్చేశాను" అన్నాడు.

నేను నా కథ ముగించేవరకూ ఆయన అలాగే ఎదురుగా బెంచీమీద కూర్చొని వున్నాడు.

"ఏమండీ సిగరెట్లు జాస్తిగా కాలుస్తారు. గుండెకు దెబ్బ స్వామీ" అన్నాడు.

నేను చిన్నగా నవ్వాను.

"ఏం చెయ్యమంటారు చెప్పండి. అలా అయిపోతూనే వుంటాయి" అన్నాను.

"ఎక్కువగా తాగకండి. తాగితే ప్రమాదం."

"మరి ఒదలడం ఎలా" అన్నాను.

"అమ్మో...ఎలాగయినా కాని దాన్ని ఒదిలిపెట్టేయాలి స్వామీ" అన్నాడు నొచ్చుకొంటూ. అతనికేం తెలుసు. ఇవాళ ఈపూట కాఫీ త్రాగలేదని. ఒకవేళ తెలిస్తే ఇన్ని సిగరెట్లు కాల్చేరే అని అడిగేవారు కాదనిపించింది. ముసలాడి మనస్సు అంతవరకూ ఏం పోతుందిలే అనుకున్నా. తర్వాత ఆఫీసు విషయాలు మొదలైనవి మాట్లాడుకొంటూ కూర్చున్నాం. చీకటి పడిపోయింది. గడియారం ఏడు గంటలు కొట్టింది. నెమ్మదిగా లేచాను.

"మరి నేను వెళ్ళతాను. మీరు ఇంటికిపోతే జాగ్రత్తగా ఆఫీసు తలుపు తాళం వేసి వెళ్ళండి" అంటూ బయలుదేరబోయాను.

"ఇంకా ఇంటికి వెళ్ళనండి" అన్నాడు.

"ఎందుకని. భోజనానికి వెళ్ళరా!" అన్నాను ఆగి.

"ఏం భోజనమండి. రాత్రిపూట భోజనం చేసి ఐదుసంవత్సరాలైంది" అన్నాడు విచారంగా తలవంచుకొని.

"ఆ ఏమిటన్నారు!" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును బాబుగారు. పాత ఉద్యోగంలోంచి తీసేసిన తర్వాత ఈ ఉద్యోగంలో చేరినదగ్గర్నుంచి రాత్రిపూట భోజనం లేదండి."

"వెళ్ళటానికి వీలులేక భోజనం మానేశారా?"

"లేదుబాబూ. అసలు ఈ డబ్బుతో ఇంటి దగ్గర జరగదు."

ముసలాడి నోటినుండి ఆ మాటలు వింటుంటే నాగుండె తరుక్కుపోయింది.

"మరి సంపాదించే కొడుకులెవరూ లేరా?" అన్నాను.

"ఉంటే ఈ గతి ఎందుకొస్తుందండి. సంపాదించే కూతురు మొగుడు కూడా చచ్చిపోయాడు. ఉంటే ఎలాగుండునో" అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

"నేనూ మానవుణ్ణే. అతనూ మానవుడే" అనిపించింది. గబగబా టిక్కెట్ల పుస్తకంలోంచి టిక్కెట్టు చింపాను.

"తీసుకోండి. ఈ పూటకు భోజనం చెయ్యండి" అన్నాను.

"ఎందుకులెండి. ఈ బీదవాడిమీద దయవుంటే చాలు" అన్నాడు మర్యాదగా. ఆఖరుకు బలవంతంమీద తీసుకున్నాడు బాగా బ్రతికి చెడినవాడిలా కనుపించాడు. గబగబా రోడ్డుమీదకు నడిచాను ఆలోచిస్తున్నాను- ఒక్కపూటకు కాఫీ తాగకపోతే నాకు మనస్సు ఇంత బాధ పడిందే. రోజూ ఒకపూట భోజనం చెయ్యనివాడి బాధ ఎలా వుంటుంది. వూహించుకోలేకపోయాను కాని ఆయన నా హృదయంలో ఇంకా మెలుగుతూనే వున్నారు. ఆయన మనస్సులో ఎంత బాధ పడినా పైకిమాత్రం నవ్వుతూనే కనుపిస్తాడు. ఆనాడు శివుడు గరళం మ్రింగి మామూలుచే కనుపించాడు. ఈనాడూ ఒక మానవుడూ అష్టకష్టాల్ని మనస్సులోనే దాచేసుకొని మామూలు మనిషిలాగానే శాంతంగా కనుపిస్తున్నాడు. ఏమిటీ మాయ అనుకొంటూ హోటలువైపుకు నడిచాను.

